క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులతో సంవర్ధన్ క్లబ్ సభ్యులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఆల్ ఇండియా లైనస్ సర్వీస్ ఆర్గనైజేషన్ భాగ్యనగర్ టీఎస్–1 సంవర్ధన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జ్యోతి చలసాని ఆధ్వర్యంలో చీరలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంవర్ధన్ క్లబ్ కోశాధికారి లైనస్ సరళా రాజ్యలక్ష్మి, సభ్యులు లైనస్ గీత, లైనస్ అఖిల, లైనస్ జీవిత తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, ఉపాధి హామీ పథకం నిధులు రూ.17లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను గ్రామ నాయకులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, పద్మ, బాల్‌రాజ్‌గౌడ్, మల్లయ్య, నర్సింలు, మున్వర్, అంజద్, చెన్నయ్య, యాదయ్య, యాదయ్య, అన్వర్, సత్యం, జయమ్మ, లక్ష్మయ్య, కుమార్, బాల్‌రాజ్, ఎండీ అబ్దుల్ వాహబ్, వెంకటయ్య, కృష్ణయ్య, నర్సింలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు హోలీ సంబురాలు



హోలీ సంబురాల్లో విద్యార్థులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పరెడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఒకరిపై ఒకరూ రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సదాలక్ష్మి, ఉపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించటంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలన్నారు. టీఏఎఫ్ఆర్‌సీ తన ఫీజుల పెంపు ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, ప్రేమ్, ఆకాశ్, శివకుమార్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

మహేశ్వరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలను ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు విద్యా, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే సమాజం గుర్తిస్తుందన్నారు. మహిళలు పురుషులతో పోటీపడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలివేలు, మహిళా పారిశుద్ధ్య కార్మికులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హోలీ.. రంగుల కేళి



పండుగకు ప్రజలు సిద్ధం

- కలర్స్ కొనుగోళ్లలో నిమగ్నం
- నేడు హోలీ ఉత్సవాలు
- సహజ రంగులే ఆరోగ్యానికి మేలు

షాబాద్: హోలీ.. రంగుల కేళి. చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా అందరు కలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకుంటారు. హోలీని చెడుపై మంచి సాధించిన విజయంగా కూడా భావిస్తారు. రంగుల పండగను శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు మండల ప్రజలు సిద్ధమయ్యారు. పిల్లలు రంగులు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. రసాయన రంగులు వద్దని, సహజరంగులే ఆరోగ్యానికి మేలని వైద్యులు సూచిస్తున్నారు.

కనిపించని సహజరంగులు..

ఈ రోజుల్లో హోలీ అనగానే రసాయన రంగులు తెచ్చి గుప్పుకుంటున్నారు. వీటిని వాడటం ప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. గతంలో ప్రకృతి ఒడిలో లభించే పూలతో తయారుచేసే సహజ రంగులతో హోలీ ఆడేవారు. మోదుగు, శంకు, ఎర్రమందారం, గోరింటాకు తదితర పూలు, చెట్ల ఆకులతో సహజ రంగులు తయారు చేసేవారు. పూలు, ఆకులు ఎండబెట్టి వేడి నీళ్లలో నానబెట్టి రంగులు సిద్ధం చేసేవారు. వీటిని ఒంటిపై చల్లుకున్నా ఎలాంటి హాని ఉండేది కాదు. ఇంతకుముందు పల్లెల్లో మోదుగు పూలతో తయారుచేసిన రంగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఈత రాకుండా నీటిలో దిగకూడదు.
- చెరువులోతు తెలియకుండా ఈత కొట్టడం నీటిలో విన్యాసాలు చేయడం మంచిది కాదు.
- ఈత వచ్చినా ఎక్కువ సమయం నీటిలో ఉండొద్దు.
- మద్యం సేవించిన తర్వాత ఈత కొట్టకపోవడమే మేలు.
- రసాయన రంగులను చెరువులు, కుంటల్లో కడుక్కోవడంతో నీటి కాలుష్యం జరుగుతుంది.

సూచనలు..

- హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.
- రంగుల్లో ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అరికట్టవచ్చు.
- ఎరుపు రంగు కోసం బీట్‌రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
- పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం వాడొచ్చు.
- సహజ రంగుల్లో లభించే యాంటియాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి, చర్మాన్ని మృదువు చేస్తాయి.

కృత్రిమ రంగులతో ఇబ్బందులు..

- నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్‌కు కారకం.
- నీలి రంగు పుసియన్‌బ్ల్యూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) కేన్సర్‌కు కారణమవుతాయి.
- పౌడర్లు, గులాల్, లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్‌లతో వినికిడి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్ఫలితాలకు దారితీస్తాయి.



షాబాద్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు

మార్పునకు కృషి చేయాలి



హోలీ పండుగను పురస్కరించుకొని తమ గ్రామంలో ప్రతీ సంవత్సరం ప్రజల్లో మార్పు కోసం కృషి చేస్తున్నాం. సహజసిద్ధ రంగులను వాడుకోవాలి. రసాయన రంగులు కళ్లలో పడితే చూపు దెబ్బతింటుంది. ప్రకృతిలో లభించే పూలు, ఆకులు, ఇతరత్రా వాటితో తయారయ్యే రంగులను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడినట్టే అవుతుంది.

–గంగిడి భూపాల్‌రెడ్డి, యువకుడు, హైతాబాద్

రసాయన రంగులు వాడొద్దు



పండగ సందడిలో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడంతో ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది తప్పవు. రంగులు కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావొచ్చు. స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. సహజసిద్ధ రంగులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, షాబాద్

ప్రాణాలతో చెలగాటం వద్దు



రంగుల పండగ పూర్తయిన తర్వాత చాలా మంది యువకులు, పెద్దలు స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలాకాకుండా ఇంటివద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం. చెరువులు, బావుల వద్దకు వెళ్లి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– కాంతారెడ్డి, సీఐ, షాబాద్

ఆహారపు అలవాట్లతోనే కిడ్నీ సమస్యలు

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: ఆహారపు అలవాట్లు, జీవనశైలి కిడ్నీ వ్యాధులకు దారి తీస్తాయని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం మూత్రపిండాలని, శరీరంలోని మలినాలను వడబోసి, రక్తాన్ని శుద్ధి చేయడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కిడ్నీల పనితీరు బాగున్నప్పుడే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. లేదంటే అవయవాల పనితీరు దెబ్బతిని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. నీటిని ఎక్కువగా తాగడంతో కిడ్నీల వడపోత సమయంలో మలినాలు సులభంగా తొలిగిపోతాయని తెలిపారు. కిడ్నీల సమస్యలు తగ్గి, వాటి పనితీరు మెరుగుపడుతుందన్నారు. అదేవిధంగా ప్రతీ చిన్న సమస్యకు నొప్పి నివారణ మందులు వాడటం సరికాదని, ఈ మందులు తాత్కాలికంగా ఉపశమనం కల్పించినా కిడ్నీల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. సిగరెట్లు, మద్యం సేవించడం మానేయాలని సూచించారు. షాద్‌నగర్ ఆస్పత్రిలో ప్రతి రోజు 18 మందికి డయాలసిస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, అనీషా, మధుసూదన్, రాజశేఖర్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



కొత్త రేషన్‌కార్డు దారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా 22 మందికి కొత్త రేషన్‌కార్డులు అందజేసి బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డులను ప్రభుత్వంనిరంతరంగా అందిస్తుందని, కార్డులు లేనివారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం రేషన్‌కార్డు అందజేసి, బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఎవరూ ఆందోళనకు గురి కావొద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగయ్య, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణగౌడ్, ప్రవీణ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు వెంకటేశ్, రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌ముదిరాజ్, రాజుగౌడ్, మినాజుద్దీన్, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న 69 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాగా గురువారం మోకిల గ్రామంలో వారందరికీ ఆయన రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని, ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీ బస్సు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య, నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మీర్‌పేట–1,2 అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్‌లు సీడీఎంఏ (కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అధిక ఇంటి పన్నులతో ప్రజలపై భారం పడుతోందని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. దీనికి సీడీఎంఏ సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. పన్ను తగ్గించని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, ప్రభాకర్, తిరుపతిరెడ్డి, కాశీరాం యాదవ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంఈఓ మనోహర్



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైన మెట్టు అన్నారు. పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దని, భయాన్ని వీడి పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏఐఎస్ఎఫ్ నాయకులు చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, శంకరయ్య, తిరుపతిరెడ్డి, నాయకులు శ్రీను, అరుణ్, రాజేశ్, సునీల్, చందు తదితరులు పాల్గొన్నారు.

అపర చాణక్యుడు బూర్గుల రామకృష్ణారావు

ఉద్యమకారుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అపర చాణిక్యుడని ఉద్యమకారుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. బూర్గుల రామకృష్ణారావు జయంతిని ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బూర్గుల రామకృష్ణారావు ఎంతో కృషి చేశారన్నారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూనే గ్రంథాలయ ఉద్యమం, భూదానోద్యమం చేపట్టి పేదల సంక్షేమం కోసం ఆయన ఎంతో పాటుపడ్డారన్నారు. రాజకీయవేత్తగానే కాక సాహితీవేత్తగా ఎన్నో రచనలు రచించారన్నారు. బూర్గుల రామకృష్ణారావు ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌కుమార్, పినబాక ప్రభాకర్, శంకర్, శ్రీను నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, జాంగారి నర్సింహ, రవికుమార్‌గౌడ్, సిద్దల శ్రీనాథ్, బీరప్ప, సునీల్ రెడ్డి, ఎల్లోజీ, మల్లేశ్, ఉమాప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగేవరకు నియామకాలు చేపట్టొద్దు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి
- ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే నిరాహార దీక్షకు బీఆర్ఎస్ సంఘీభావం



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్: ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో జరిగే వరకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడో రోజు గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు తనం మంచిది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగి రిజర్వేషన్లపరంగా వాటాలు తేల్చిన తర్వాతే నియామకాలు చేపట్టాలన్నారు. అందుకోసం ఎమ్మార్పీఎస్ నాయకులు చేపడుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ, నాయకులు రాజు మాదిగ, భాస్కర్, కృష్ణ, ఏసురత్నం, పరమేశ్, సత్తిరెడ్డి, ప్రవీణ్, చిన్న తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మహేశ్వరం: తండాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా తాము నిరంతరం పని చేస్తామని మాజీ సర్పంచ్ మెఘావత్ రాజునాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాగుల్‌దోని తండాలో ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాల్లోని ప్రతీ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణంతో పాటు ప్రతీ ఇంటికి తాగునీరు, వీధి దీపాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తండాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో తండాలను మరింత అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో అర్చకులు, భక్తులు

తుక్కుగూడ: పురపాలక పరిధి మంఖాల్(ఈ–సిటీ) శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగ సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించారు. శ్రీవారి దంపతులను రథంపై ఉంచి ఆలయ మాఢ విధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తాగునీటి వసతి, భోజనం తూళ్ల వీరేందర్‌గౌడ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు శేషం జగన్నాథ చార్యులు, శేషం సింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు

ఖాళీ స్థలం.. వేసెయ్ చెత్త!



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వేసిన చెత్త

- మొయినాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట చెత్తాచెదారం
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న రోగులు, స్థానిక ప్రజలు

మొయినాబాద్: మొయినాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రోడ్డు పక్కనే చెత్త వేస్తుండడంతో ఆ దుర్వాసనకు ఆస్పత్రికి వచ్చేవారితో పాటు రోడ్డుపై వెళ్తున్నవారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని మున్సిపల్ అధికారులు ప్రచారం చేస్తున్నా, ప్రజలు మాత్రం దాన్ని పట్టించుకోవడంలేదు. ఇష్టం వచ్చినట్లు రోడ్డు పక్కనే వేస్తుండడంతో దుర్వాసన వస్తోందని, దీంతో ఆస్పత్రికి వచ్చి, పోయేవారు ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి, చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.